క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో చతుర్థి పూజలు

ఆసిఫాబాద్అర్బన్: సంకష్టహర చతుర్థిని పురస్కరించుకొని ఆదివారం రాత్రి 7 గంటలకు జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడ గణపతి దేవాలయం, శివకేశవ మందిర్‌లో అర్చకులు శ్రీనివాస్‌శర్మ, ఒజ్జల శిరీష్‌శర్మ, రాజశేఖర్‌శర్మల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో వినాయకుడికి అభిషేకం, అష్టోత్తర శతనామావళి, ఏకదశ ఉపనిశత్తులు, పుష్పార్చన, మంగళహారతి నిర్వహించారు.

సత్యసాయి బాబా జయంతి



ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

కాగజ్‌నగర్ రూరల్: మండలంలోని నవేగాం గ్రామంలో ఆదివారం సత్యసాయి బాబా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు భజన కార్యక్రమాలు చేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సంఘం అధ్యక్షుడు జనార్దన్, కన్వీనర్లు, కోఆర్డినేటర్లు, భక్తులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

దహెగాం: మండలంలోని హత్తిని గ్రామంలో ఆదివారం ఇషా హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఆయా గ్రామాల నుంచి వచ్చిన రోగులను వైద్యులు సుజాత, లక్ష్మి ప్రసాద్‌లు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించి ఆరోగ్యంగా ఉండాలన్నారు. 150 మంది రోగులకు వైద్యం అందించినట్లు తెలిపారు. నాయకులు శంకర్‌గౌడ్, రాకేశ్, శ్రీకాంత్, వినోద్‌కుమార్, సతీష్, నవీన్ పాల్గొన్నారు.

యువత ఉద్యోగాలు సాధించాలి




ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న నాయకులు

కౌటాల: గ్రామీణ యువత ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలని ఆరె సంక్షేమ సంఘం మండలాధ్యక్షుడు వసంత్‌రావు అన్నారు. ఇటీవల ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగం సాధించిన తుమ్మిడిహెట్టి గ్రామానికి చెందిన ఎస్. చంద్రశేఖర్‌ను ఆరె సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. ఉన్నత చదువులతోనే బంగారు భవిష్యత్ ఉంటుందన్నారు. యువత చెడు వ్యాసనాల బారిన పడకుండా చదువుపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎల్ములే మల్లయ్య, నారులే వాను పటేల్, మోతిరాం, బండురావు, ప్రకాశ్, సునీల్ పాల్గొన్నారు.

సాంకేతిక సమస్యలతోనే విద్యుత్ సరఫరాలో అంతరాయం

సిర్పూర్(టి): వర్షాభావ పరిస్థితుల వల్ల సిర్పూర్(టి) సబ్‌స్టేషన్ పరిధితో పాటు కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్ మండలాల్లో వ్యవసాయ విద్యుత్ సరఫరాలో అంతరాయం వాటిల్లుతుందని విద్యుత్ శాఖ ఏఈ ఇర్ఫాన్ ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ బోర్లపై ఆధారపడి ఉన్న వాటిని వినియోగించుటకు 33 కేవీ ఫీడర్ పైన సగటున 280ఏ నుంచి 300ఏ వరకు లోడ్ వచ్చి సాంకేతిక సమస్య ఏర్పడే అవకాశం ఉందన్నారు.

సన్మానం



సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

వాంకిడి: డీఎస్సీ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఉపాధ్యాయ కొలువులు సాధించిన ఖమాన గ్రామానికి చెందిన బండె తిరుపతి, గొడిసెల ప్రశాంత్, నగోసె భీంరావు, మెంగినేని సునీలను ఆదివారం గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులైన బూరం దుర్గయ్య, సంతోష్, తుకారం, శారద, బండె హరీష్, దశ్వంత్‌లను అభినందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ హివ్రె సతీష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఉట్నూర్‌రూరల్: ప్రభుత్వ గిరిజన పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ) ఉట్నూర్ నందు ప్రవేశానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు.

విజృంభిస్తున్న జ్వరాలు..!

- పట్టించుకోని ఆరోగ్యశాఖ
- గ్రామాల్లో పర్యటించని వైద్య సిబ్బంది
- పేరుకే వైద్య శిబిరాలు



బెజ్జూర్: జిల్లాలో విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. అభం శుభం తెలియని వయస్సులోనే కానరాని లోకాలకు వెళ్లిపోతున్నారు. రెండుమూడు రోజుల జ్వరం కారణంగా ఒళ్లు.. కీళ్లనొప్పులు వంటి సమస్యలతో బాధపడుతున్నారు. కుమురం భీం ఆసిఫా బాద్ జిల్లాలో 15 మండలాలు, 334 గ్రామపంచాయతీలు ఉన్నాయి. ప్రతీ గ్రామంలో విష జ్వరాల బారినపడి జనాలు ఇబ్బంది పడుతున్నారు. అయి న్నా.. జిల్లా వైద్యశాఖ మాత్రం పట్టించుకోవడం లేదు. గ్రామాల్లో నామమాత్రంగా వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి చేతులు దులుపుకుంటున్నారు.

పట్టించుకోని వైద్య ఆరోగ్యశాఖ..

జిల్లాలో ఈఏడాది ఇప్పటి వరకు అధికారుల లెక్కల ప్రకారం 48 డెంగ్యు కేసులు, 47 మలేరియా, 27 టైఫాయిడ్ కేసులు నమోదయ్యాయి. అయినప్పటికీ ఇప్పటి వరకు గ్రామాల్లో ఇక్కడ కూడా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రజలకు అవగాహన లేక అనేక మంది జ్వరాలతో బాధపడుతున్నప్పటికీ సంబంధిత వైద్య సిబ్బంది క్షేత్ర స్థాయిలో పర్యటించి జ్వరాలపై అవగాహన కల్పించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

ఆసుపత్రికి బారులు..

జిల్లా వ్యాప్తంగా రోజుకు 10 నుంచి 20 మంది ప్రైవేట్ ఆస్పత్రులతో పాటు ఆర్‌ఎంపీల వద్ద చికిత్స పొందుతున్నారు. అలాగే పెద్ద ఆస్పత్రుల్లో లెక్కలేని మంది జ్వరపీడితులు ఉన్నారు. వేల రూపాయలు ఖర్చులు పెట్టి చికిత్స చేయించుకుంటున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సరైన చికిత్స అందించక పోగా.. మందులు కూడా లేని పరిస్థితులు ఉన్నాయన్నారు. గత కొన్ని రోజుల క్రితం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు మందులు, ఇంజక్షన్లు అందుబాటులో లేవనే లిస్టును సైతం గోడకు అంటించారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలు ప్రైవేట్ ఆస్పత్రుల వైపు పరుగులు తీస్తున్నారు. జిల్లాలో ఇప్పటివరకు 48 డెంగ్యు కేసులు, 47 మలేరియా, 27 టైఫాయిడ్ కేసులు నమోదయ్యాయి.

గతంలో మృతి చెందిన జ్వరపీడితులు..

- కౌటాల మండలం గుండాయిపేట్ గ్రామానికి చెందిన కాళిదాస్ జ్వరంతో బాధపడుతున్న వ్యక్తిని కుటుంబసభ్యులు మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు.
- కౌటాల మండలం గుండాయిపేటకు చెందిన జాడి కిషోర్- సురేఖ దంపతుల పెద్ద కుమార్తె పూజ (16) పదో తరగతి విద్యార్థి గతంలో జ్వరంతో బాధపడుతూ హైదరాబాద్ ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందింది.

జ్వరంతో యువకుడి మృతి



అంజన్న (ఫైల్)

బెజ్జూర్ మండలం ఎలుకపెల్లి గ్రామానికి చెందిన వడుగురి చంటయ్య ప్రేమల అనే దంపతులకు ఇద్దరు కుమారులు. కాగా అందులో పెద్ద కుమారుడు అంజన్న(17) గత రెండు మూడు రోజులుగా జ్వరం రావడంతో సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేరాడు. అయినప్పటికీ జ్వరం తగ్గకపోవడంతో కాగజ్‌నగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, అక్కడి వైద్యుల సూచన మేరకు మంచిర్యాల పట్టణానికి తీసుకెళ్లారు. అక్కడ సైతం వైద్యులు యువకుడి పరిస్థితి చూసి మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ వెళ్లాలని సూచిండంతో కరీంనగర్‌కు తరలించారు. వైద్యం అందిస్తున్న క్రమంలో రక్త కణాలు 20వేలకు పడిపోవడంతో ఆదివారం తెల్లవారు జామున మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు.

అకాల వర్షం.. పంటలకు నష్టం



ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని అప్పపల్లి, గొల్లగూడ, కుమ్మగూడతో పాటు పలు గ్రామాల్లో శనివారం రాత్రి కురిసిన అకాల వర్షంతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. పొట్ట దశలో ఉన్న వరి నేలకొరిగింది. బెల్గాం, ఖప్రి, వావుదాం వట్టి ఎత్తు ప్రదేశాలల్లో సాగు చేసిన పత్తి పంట తీసే సమయంలో వర్షం రావడంతో పత్తి నల్లబడుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

‘సీఈవోను వెంటనే తొలగించాలి’



మాట్లాడుతున్న శంకర్

బెజ్జూర్: దళిత సామాజిక వర్గానికి చెందిన మార్కెట్ కమిటీ చైర్మన్‌ను అవమానించిన దహెగాం మండల సీఈవో బక్కయ్యను విధుల నుంచి తొలగించాలని కాంగ్రెస్ బెజ్జూర్ మండల అధ్యక్షుడు బుస శంకర్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవంలో నిబంధనలు పాటించకుండా దళిత సామాజిక వర్గానికి చెందిన కమిటీ చైర్మన్‌ను ఆహ్వానించకుండా వ్యవహరించిన సీఈవోతో పాటు సింగిల్ విండో చైర్మన్, వైస్ చైర్మన్‌లను తక్షణమే తొలగించాలన్నారు. ఈ విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆత్రం రాజారాం, సుంకర్ విష్ణుమూర్తి, జాహిద్ హుస్సేన్, మురళి గౌడ్, దందర అంకయ్య, మడే లక్ష్మణ్, తొర్రెం వినోద్, తొర్రెం ప్రశాంత్ పాల్గొన్నారు.

మున్నూరుకాపుల హక్కుల సాధన కోసం పోరాడాలి



సమావేశంకు పాల్గొన్న జిల్లా నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: మున్నూరు కాపు హక్కుల కోసం ఐక్యంగా ముందుకు వెళ్లాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవయ్య అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గం సమావేశానికి జిల్లా నాయకులు హాజరయ్యారు. మున్నూరు కాపు ఆర్థికంగా, రాజకీయంగా సమాజంలో గొప్పస్థాయికి ఎదగాలని తెలిపినట్లు ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడు వెంకన్న, సురేశ్, వెంకటేశ్, గణపతి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సమ్మేళనానికి తరలిన ఏఈవోలు



మాట్లాడుతున్న ఏఈవోలు

ఆసిఫాబాద్అర్బన్: గత 20 రోజులుగా వ్యవసాయ శాఖలో ఉన్నతాధికారులకు, వ్యవసాయ విస్తరణ అధికారులకు మధ్య డిజిటల్ సర్వే విషయంలో తీవ్రమైన అగాధం ఏర్పడిన సందర్భంలో ఆదివారం హైదరాబాద్‌లోని నిర్వహించిన ఏఈవోల రాష్ట్ర స్థాయి సమ్మేళనానికి జిల్లాకు చెందిన ఏఈవోలు తరలివెళ్లారు. ఈసందర్భంగా ఏఈవోలు మాట్లాడుతూ.. గత ఏడు సంవత్సరాలుగా క్షేత్రస్థాయిలో ఎలాంటి సహాయకులు లేకుండానే భారాన్ని భరిస్తూ, శారీరక, ఆర్థిక నష్టాల కారణంగా సమస్యల పరిష్కారానికి ఉన్నతాధికారులకు విన్నవించినా ఎలాంటి ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యల సాధన కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఏఈవోలు చర్చించడం జరిగిందన్నారు.

సభ్యత్వ నమోదు వేగవంతం చేయండి



మాట్లాడుతున్న పాల్వాయి సుధాకర్ రావు

బెజ్జూర్: అన్ని గ్రామాల్లో బీజేపీ సభ్యత్వ న మోదును వేగవంతం చేయాలని మాజీ జెడ్పీటీసీ, బీజేపీ నాయకుడు పాల్వాయి సుధాకర్ రావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో సభ్యత్వ నమోదుపై కార్యకర్తలతో చర్చించారు. ప్రతీ గ్రామంలో బూత్ స్థాయిలో సభ్య త్వ నమోదు చేయించాలన్నారు. పార్టీ కోసం కష్టపడే వారికి తగిన గుర్తింపు ఇస్తుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సామల తిరుపతి, నేరెళ్ల సంతోష్, దిగంబర్, రామ య్య, రాజారాం, శ్యాంసుందర్, రాకేశ్, బాపు, వసీఉల్లా ఖాన్, వసంత్, ఇందిరా, తదితరులు పాల్గొన్నారు.

వర్షవాస్ కార్యక్రమాలతో మనోవికాసం



చేతన్‌శర్మ దంపతులను సన్మానిస్తున్న నాయకులు

వాంకిడి: వర్షవాస్ కార్యక్రమాలతో ప్రజలలో మనోవికాసం, ఆధ్యాత్మికత భావన సాధ్యపడుతుందని భారతీయ బౌద్ధ మహాసభ (బీఎస్ఐ) జిల్లా అధ్యక్షుడు అశోక్ మహోల్కర్ అన్నారు. ఆదివారం మండలంలోని ఖమాన గ్రామంలో నాగ్‌సేన్ బుద్ధ విహారలో ఆషాడం నుంచి అశ్వినీ పౌర్ణమి వరకు మూడు నెలల పాటు నిర్వహించిన 10వ వర్షవాస్ గ్రంథ పఠన ముగింపు కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా బౌద్ధ సమాజ్ నాయకులతో కలిసి గౌతమ బుద్ధుడు, బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్ర పటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. బౌద్ధ సంఘం గ్రామ అధ్యక్షుడు జాడి శేఖర్ పంచశీల్ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు శ్యాంరావు దుర్గం, తుకారాం, వినేష్ ఉప్రే, తిరుపతి దుర్గం, జాడి సంతోష్, విజయ్ ఉప్రె, విలాస్ ఖోబ్రగడె, సందీప్ దుర్గే పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

- జిల్లా వ్యాప్తంగా బీఆర్‌ఎస్ నాయకుల ధర్నా
- సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



కాగజ్‌నగర్ రూరల్: ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

కాగజ్‌నగర్ రూరల్: ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని బీఆర్‌ఎస్ నాయకులు కాగజ్‌నగర్ పట్టణంలో ఆదివారం ధర్నా చేపట్టారు. బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇంచార్జి లెండుగురె శ్యాంరావు ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. వెంటనే రైతుభరోసా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మొయిన్, ఓదెలు, సలీం, కన్నయ్య, మినాజ్, ముస్తఫీజ్, అస్లాం, వరలక్ష్మి, కమల, రమాదేవి, శోభన్ పాల్గొన్నారు.

తిర్యాణి: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నేరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని బీఆర్‌ఎస్ నాయకులు ఆరోపించారు. ప్రభుత్వం నేటికి రైతు భరోసా అందించకపోవడంపై ఆదివారం మండల కేంద్రంలో ధర్నా చేపట్టారు. రుణమాఫీ సైతం పూర్తిగా చేయలేదన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ ఆత్రం చంద్రశేఖర్, పీఏసీఎస్ చైర్మన్ చుంచు శ్రీనివాస్, మడావి గుణవంత్‌రావు, బాదిరావు, తోట లచ్చన్న పాల్గొన్నారు.

రెబ్బెన: రైతుభరోసా, రైతు రుణమాఫీ పథకాల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని పీఏసీఎస్ చైర్మన్ కార్నాథం సంజీవ్‌కుమార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపు కోసం ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేసిందన్నారు. దాదాపు 10 నెలలు గడుస్తున్నా.. రూ. 2లక్షల రుణమాఫీ జరగలేదన్నారు. దేశానికి అన్నం పెట్టే రైతులను దగా చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ బాబురావు, బీఆర్‌ఎస్ నాయకులు శ్రీధర్‌రెడ్డి, మహేశ్‌గౌడ్, సత్యనారాయణ, ఆనంద్, వినోద్, జైస్వాల్, శ్రీధర్, భరద్వాజ్, పోషమల్లు పాల్గొన్నారు.

కెరమెరి: వానాకాలానికి సంబంధించిన రైతులకు రైతుభరోసా ఇవ్వాలని బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై బైఠాయించారు. పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయలేదని, పింఛన్‌లు రూ.4 వేలు పెంచలేదని ఆరోపించారు. మహిళలకు నెలకు రూ.2500 ఇవ్వలేదన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ, వైస్ ఎంపీపీ పెందోర్ మోతిరాం, అబ్దుల్ కలాం, ఇస్తెకార్, యూనూస్, దండు, అంబాజీ, నారాయణ, రాంచందర్ పాల్గొన్నారు.



తిర్యాణిలో..



కెరమెరి మాట్లాడుతున్న అబ్దుల్ కలాం



రెబ్బెన: రాస్తారోకో చేస్తున్న నాయకులు

ఇందారంలో గుప్తనిధుల తవ్వకాలు

జైపూర్: మండలంలోని ఇందారం గ్రామంలో గుప్త నిధుల తవ్వకాలు జరుపుతున్న పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇందారంలో సత్యనారాయణ హోటల్ నిర్వహించే సాంబయ్య ఇంట్లో గుప్త నిధుల కోసం తవ్వకాలు జరుపుతున్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. ఎస్సై శ్రీధర్ పోలీసులతో కలిసి తనిఖీ చేయగా ఇందారం గ్రామానికి చెందిన వెన్న రాజేశ్, వెన్న వెంకటి, కాళ్ల కొమురయ్య, బద్దెల ప్రసాద్, వెన్న కుమార్, శ్రీరాంపూర్‌కు చెందిన ఐలయ్య, కుమురం భీం జిల్లా రెబ్బెన మండలం సోనాపూర్‌కు చెందిన గంగు, ఆర్క భీం, శ్రీరాం తిరుపతి, శ్రీరాం రమేశ్ పట్టుబడ్డారు. వారిని అదుపులోకి తీసుకుని, గుప్త నిధుల తవ్వకాలు జరిపిన గడ్డపార, తట్ట, పారలను స్వాధీనం చేసుకున్నట్లుగా తెలిపారు.